


# తొలగిన మబ్బులు

## అవధానుల సుధాకరరావు

> క్రమక్రమంగా ఉద్యోగం కేసి మొగ్గుతోంది ఆమె నిర్ణయం. ఆ ఉద్యోగం పొందటానికి తను చెల్లించుకోవలసిన మూల్యం మనసులో మెదిలింది. బాధగా కళ్ళు మూసుకుంది కనుకొలకుల్లోంచి వెచ్చటి కన్నీళ్ళు క్రిందికి జారేయి ఒక సమస్య పరిష్కరించబడాలంటే - కొత్త ...

"మాధురి ఎంటర్ ప్రైజెస్"

దేశంలోకెల్లా పెద్ద ఎక్స్‌పోర్టింగ్ కంపెనీ. ఏటేటా కోలెడు లాభాలు గడిస్తోన్న ఏకైక సంస్థ అందులో వుద్యోగం సంపాదించడమంటె అదృష్టం క్రిందే లెక్క. పనికి తగ్గ ప్రతిఫలం లభిస్తుంది అక్కడ.

ఆ రోజు ఆ కంపెనీ ఆవరణ యువతి, యువకులతో నిండివుంది. వారందరి చేతుల్లో సర్టిఫికెట్లు, ట్రూకాపీలువుండే ఫైల్సువున్నాయి. ముఖాల్లో నిరాశ, దైన్యం ఎక్కడో అట్టడుగున కొనవూపిరితో ఆశ తాండవిస్తున్నాయి.

రకరకాల, రంగురంగుల చీరల్లోవున్న ఆడవాళ్ళంతా ఒకవైపుగా కూర్చుని వున్నారు. కొద్దిసేపటిలో ఇంటర్వ్యూ తతంగం ప్రారంభం కానున్నది.

ఆ ఇంటర్వ్యూ తీసుకునే బాధ్యత మూర్తికి అప్పగించబడింది. అతను ఆ కంపెనీ ఎం. డి. కి స్టెనో-కమ్-పి. ఏ.

మూర్తి ఈ మధ్యనే యాభయిలో పడ్డాడు. తలవెంట్రుకలు సగం వూడిపోయాయి. గొప్ప తెలివి తేటలున్నాయి. శత్రువు దగ్గర కూడా తన పని సాధించుకోగలడు. మూర్తికి ఏ చెడ్డల వాటూలేదు. మాంసాహారం ముట్టడు మత్తు పానీయాలు వాసన చూడడు. సిగరెటు తగలెయ్యడు. గుర్రప్పందాలు అవసరంలేదు.

కాని. ఒక బలహీనత మాత్రం అతన్ని వదల్లేదు.

ఆడవాసనంటే మహా ఇది. స్త్రీ ప్రసక్తికే ఒళ్ళు మరిచిపోతాడు.

అలాంటి మహానుభావుడు — యువకులని ఇంటర్వ్యూ చేయడంలో శ్రద్ధ ఎందుకు తీసుకుంటాడు? వారి అర్హతలని పరీక్షించాలని ఎందుకనుకుంటాడు?

నిజమే

లోపలికి వెళ్ళినవారంతా నిమిషంలో బయటికొచ్చేస్తున్నారు. పావుగంటలో నిరుద్యోగ యువకులంతా శలవు పుచ్చుకున్నారు

ఇప్పుడు మిగిలినవారంతా యువతులే. పాతికేళ్ళ పరువంలోవున్న అందాల, పడుచు బొమ్మలే.

మూర్తికి మహదానందం కలిగింది. లలలా....లలలా లక్కీఛాన్సులే....అని హుషారుగా పాడుకున్నాడు లోలోపలే.

ఒక్కొక్కర్నీ ఎదురుగా కూర్చోబెట్టుకుని. తీరిగ్గా ఇంటర్వ్యూ చేస్తూ. వారి తీయని పలుకులు వింటూ. అందాలని కళ్ళతో తాగేస్తూ మత్తెక్కి వున్నాడు మూర్తి.

అందరూ అయిపోయారు. వెళ్ళిపోయారు. సరస్వతి మటుకు మిగిలివుంది. మూర్తి కావాలనే ఆమె పేరు చివరికి వచ్చేలా చేసాడు.

ఇరవై రెండేళ్ళ వయసు, పచ్చని శరీరచ్ఛాయ, నేర్పరి అయిన శిల్పి మలచిన విగ్రహంలాంటి వొంపు, సొంపుల దేహం-ఇవన్నీ ఆమెని అందగత్తెనిచేస్తే, మూర్తిని పిచ్చివాణ్ణి చేసాయి

అతని మనసులో-ఆమెని 'ట్రాప్' చేసే మార్గాలు గిరికీలు కొడుతున్నాయి.

"ఏం.... అమ్మాయ్! ఈ వుద్యోగం నీకు అవసరమా?" అడిగేడు.

కోరికతో వెలుగుతున్న మూర్తి కళ్ళలోకి ఆశగా చూసింది సరస్వతి.

"చాలా, చాలా అవసరం, సార్! మా కుటుంబం వీధిన పడకుండా వుండాలంటే, మేమందరమూ రోజుకి ఒక్కపూటైనా ఇంత తినాలంటే...ఆరుగురు మనుషులు జీవించి వుండాలంటే...." ఈ అవకాశం తనకి దొరుకుతుందనే ఆత్రంలో-తన కుటుంబ పరిస్థితిని చెప్పుకుంది. తడబడుతూ.

సరస్వతి ఎంత బలమైన పేదరికంలో వున్నదో తెలిసింది. ఆమె కుటుంబం ఆకలి కోరలమధ్య చిక్కుకుందని తెలిసి సంతోషించాడు.



పరిస్థితులు అనుకూలంగా వున్నాయి, ఈ చిన్నదాని అందం-తనపరం కావడం కొంచెం తేలికే .. అనుకున్నాడు మూర్తి.

"అర్హతలేకుండా-అవసరాలతోనే వుద్యోగం కావాలంటే ఎలా వస్తుందమ్మాయ్?" తన పథకం ప్రారంభిస్తూ అన్నాడు మూర్తి.

సరస్వతి బేలగా, తెల్లమొహంవేసి చూడటం మినహా సమాధానం చెప్పలేకపోయింది-

"నీ పర్‌ఫామెన్స్ అంత బాగాలేదు. నీకంటే చాలా గొప్పగా చేసినవాళ్ళు కూడా వున్నారు" మూర్తి నిజమే చెప్పినా, అందులో తన గొప్పతనం ప్రకటించుకోవడం కూడా వుంది.

సరస్వతి నీరసపడింది. నిరాశగా చూసింది.

"అయితే నాకీవుద్యోగం రాదా సార్?"

"నువ్వు కావాలనుకుంటే రాకపోదు" తెలివిగా అన్నాడు మూర్తి.

సరస్వతి ముఖం వెలిగింది. కళ్ళలో కాంతి వచ్చింది.

"నిజమా సార్! మీకెలా కృతజ్ఞత చెప్పుకోవాలి" ఉక్కిరి, బిక్కిరయింది. ఆమె తీయని పెదవులు చూస్తూ నాలిక తడుపుకున్నాడు మూర్తి

"ఆ మార్గం నేను చెబుతాగా."...అని, రెండు కూల్‌డ్రింక్స్ తెప్పించేడు.

సరస్వతి మొహమాటపడుతూ తాగింది.

మూర్తి డబ్బులిస్తుంటే-తనిస్తానంది.

"ఇలాంటి చిన్నచిన్నవి కావు, నువ్వివ్వవలసిందేమిటో చెప్తాను. తొందరపడకు" అన్నాడు.

అతనికి ఎం. డి. దగ్గర్నుండి పిలుపొచ్చింది సరస్వతిని కూర్చోమనిచెప్పి, లోపలికి వెళ్ళాడు అయిదు నిమిషాల తర్వాత తిరిగొచ్చాడు.

"అట్టే టైం లేదమ్మాయ్! రేపు ఉదయానికల్లా కేండిడేట్‌ని సెలక్ట్ చెయ్యమని ఇప్పుడే పిలిచి, చెప్పారు."

"........"

"నీ పేరుమీద ఆర్డర్స్ తయారు చేయిస్తాను"

సరస్వతి కృతజ్ఞతగా చూసింది.

"అనుకున్న పని జరిపించి— కొబ్బరికాయ లంచం తీసుకుంటాడు దేవుడు. మనిషినైన నాకూ అలాంటి కోరిక వుండటం తప్పు కాదుగా..."

"తప్పకుండా సార్! నా మొదటి జీతం..."

మధ్యలోనే అడ్డుకున్నాడు మూర్తి.

"పిచ్చిదాన! ఆడదాని దగ్గర్నుండి—మగాడు కోరేది డబ్బు మాత్రమేనా?"

మెడలో పాము చుట్టుకున్నట్టు— ఒక్కసారిగా సరస్వతి ఉలిక్కిపడింది.

"నా సంగతి చూసేట్లయితే—ఈ ఉద్యోగం నీది. ఆలోచించుకో.

అంగీకారమైతే— సాయంత్రం ఐదుగంటలకి 'లిబర్టీ' దగ్గర వుండు.

యింట్లో చెప్పిరా—రాత్రికి రాకుంటే కంగారు పడతారేమో!" తన పథకం పారుతుందనే ధీమాలో వున్నాడు మూర్తి. అయినా ఎక్కడో చిన్న అనుమానం—పెళ్ళికాని అమ్మాయిలు వుత్తి సెంటిమెంటల్ ఫూల్స్! శీలం, పవిత్రత అనే వెర్రి నమ్మకాలు వారినింకా వదల్లేదు.

శీలమే ముఖ్యమనుకుంటుందేమో! ఉద్యోగం వదులుకుంటుందేమో!

ఈ రకమైన ఆలోచనల్లో మూర్తి వుంటే-

అక్కడ సరస్వతి ఏ నిర్ణయానికి రాలేక సతమతమవుతోంది.

అప్పుడే నాలుగు గంటలయింది. ఇంకా ఒక గంట...

ఏ నిర్ణయం తీసుకోవాలి?

ఒకవేపు అంతరాత్మ-ఇదితప్పు అంటోంది ఈ పని చేయవద్దంటున్నది. మరోవేపు పరిస్థితుల వొత్తిడి, బాధ్యతల బరువు.

పేరు తెలియని రోగంతో రోజు, రోజుకీ కృశించిపోతున్న తల్లి...

ఏక్సిడెంట్ లో కాలుతోపాటు— ఉద్యోగాన్ని పోగొట్టుకున్న తండ్రి.

నిరాధారమయిన కుటుంబం....

బంగారు భవిష్యత్తకోసం కలలు కంటున్న యిద్దరు పసి వెధవలు (తమ్ముళ్ళు). ఇంతమందికి ఆధారం తను. వీళ్ళని పోషిస్తూ, తనకో దారి ఏర్పరచుకోవాలంటే-ఈ వుద్యోగం తనకి అవసరం.

ఇది కాకపోతే మరో వుద్యోగం దొరుకుతుందనే ఆశ లేదు. ఈ రోజుల్లో అర్హతలు, సర్టిఫికెట్లు చూసి, ఏ ఇతర ప్రతిఫలం ఆశించకుండా వుద్యోగాలిచ్చే ధర్మాత్ములు ఇంకా మిగిలి వున్నారా- అనిపించిందామెకి.

ఈ పరిస్థితుల్లో తమ కుటుంబాన్ని ఆదుకునే ఉదారులు కూడా లేరు. ఎవరి బ్రతుకు వారికే భారంగా వుండే రోజులివి.

క్రమక్రమంగా ఉద్యోగం కేసి మొగ్గుతోంది ఆమె నిర్ణయం. ఆ ఉద్యోగం పొందటానికి తను చెల్లించుకోవలసిన మూల్యం మనసులో మెదిలింది.

బాధగా కళ్ళు మూసుకుంది. కనుకొలకుల్లోంచి వెచ్చటి కన్నీళ్ళు క్రిందికి జారేయి. ఒక సమస్య పరిష్కరించబడాలంటే- కొత్తగా మరికొన్ని సమస్యలు సృష్టించుకోవాలి. ఒక దారిలో పోవాలని అనుకున్నప్పుడు- మరికొన్ని దారులు మూసుకుపోతాయి. ఒకవ్యక్తి నిర్ణయం చాలా మందిని, చాలా రకాలుగా ప్రభావితం చేస్తుంది.

* * *

మగవాడి నీడ కూడా పడని శరీరం ఆమెది. తనని ఏలుకునే మగవాడి కోసం దాచుకున్న యవ్వనపు అందాలు బ్రతుకు తెరువు బలి తీసుకుంది.


ఆ రాత్రి సరస్వతి ఇంటికి పోలేదు.

మూర్తి- ఆమెతో అమరసుఖాలు అనుభవించేడు. కోరికల అంచులు చూసాడు.

మరునాడే సరస్వతి "మాధురి ఎంటర్ ప్రైజస్"లో ఉద్యోగిని అయింది.

నెలకి ఏడొందల జీతం. ఏడాదికి రెండువేల బోనస్.

దీపం!






ట్రూ ..

టైపిస్ట్ తాతారావుని పిలిచాడు ఆఫీసర్ ముకుందం.

"దీనికి ట్రూ కాపీ కావాలి. చేసి పట్రండి...." ఇచ్చాడు.

టైప్ చేసిచ్చాడు తాతారావు.

"ఇదేమిటయ్యా? దాంట్లో కొట్టేసినవీ, తప్పులూ అన్నీ టైప్ చేసేశావు?" కోపంగా అడిగాడు ఆఫీసర్ ముకుందం.

"ట్రూ కాపీ కదండీ!" వినయంగా అన్నాడు తాతారావు.

—ఎన్. మురళీమోహన్ (నరసన్నపేట)

ఆ రోజుతో ఆమెకి తన శరీరం మీద మమకారం పోయింది. ఎంతో అపురూపంగా చూసుకునే వయసుని మరిచిపోయింది.

అలంకరణని మరిచింది. సరదాలు.ఉత్సాహం పూర్తిగా తుడిచేసుకుంది

తనని తాను ఓ యంత్రంలా భావించింది.

ఆ తరువాత. మరో ఆరు నెలలకి....

సరస్వతిని కన్ఫర్మ్ చేసే సమయంలో...:

మరోసారి మూర్తి కోరికకి గురయింది.

* * *

సరస్వతికి అభిముఖంగా కూర్చుని వున్నాడు రాఘవరాం.

ఆమె ముఖం ఉదాసీనంగా వుంది. అతని సమక్షంలో ఆమె అలా ఎప్పుడూ లేదు

"ఏమయింది సరస్వతీ! అలా వున్నావ్!" ఆప్యాయంగా అడిగేడు రాఘవరాం.

"అబ్బే.... బాగానేవున్నానే....!" ఉలిక్కిపడుతూ జవాబిచ్చింది.

"ఏవేవేదో దాస్తున్నావ్ సరస్వతీ! సరే పోనివ్వు.... ఈ మధ్య నీనుండి సరిగా ఉత్తరాలు రావడం లేదు...."

ప్రయత్నపూర్వకంగా పెదవులపైకి నవ్వు తెచ్చుకుంది సరస్వతి.

"అలాంటిదేం లేదు, బావా! కొత్త వుద్యోగం కదా. తీరిక చిక్కడం లేదు...." అంది.

"అందుకే నేను స్వయంగా వచ్చాను. మన పెళ్ళి విషయం ఏ నిర్ణయించావ్....?"

"ఇప్పుడే ఏం తొందర....?"



## రేషన్

"రాజేష్! మంగళూరు దేనికి ప్రసిద్ధి చెందింది?" టీచర్ క్లాస్‌లో ప్రశ్నలు అడుగుతున్నాడు.

"నాకు తెలియదు సార్!" చెప్పాడు రాజేష్.

"తెలియదూ! మీ ఇంట్లో రోజూ వాడుకున్న పంచదార ఎక్కడినుండి వస్తోందనుకుంటున్నావ్!"

"మాకైతే రేషన్‌షాప్‌నుండి సార్"

—రజనీశకుంతల (హైదరాబాద్)

"ఈ మాటంటున్నది నువ్వేనా?" ఆశ్చర్యపోతూ ఎదురు ప్రశ్నించాడు. తను రాసే ప్రతి ఉత్తరంలోనూ సరస్వతి వివాహం గురించి ప్రస్తావించేది. ఇప్పుడామె ఇలా హఠాత్తుగా ఎందుకు మారింది....? మునుపటి ఉత్సాహం కూడాలేదు. ఏం జరిగింది?

"అది కాదు బావా! నేను..." ఆ తరువాత ఎలా చెప్పాలో తెలీలేదు ఆమెకి. అలా అని, చెప్పకుండా బావని మోసగించే ఉద్దేశమూ లేదు.

"ఇక ఏం చెప్పొద్దు సరస్వతి. త్వరలోనే నిన్ను నా దాన్ని చేసుకుంటాను. ఆ తర్వాత నువ్వేం చెప్పదల్చుకున్నావో చెప్పు. ఓపిగ్గా వింటాను...."

రెండు నెలల్లోనే రాఘవరాం మాటలు నిజమయ్యాయి. సరస్వతి మెడలో మూడుముళ్ళు వేసాడు.

ఈ పెళ్ళి తనుపుట్టినప్పుడే నిశ్చయమయింది. బావని అప్పట్నుండే ప్రేమించసాగింది. ఈనాడు ఆ ప్రేమతో తన హృదయం నిండిపోయింది.

అంత గాఢంగా ప్రేమించిన బావకి- తన దురదృష్టపు కథ చెప్పి అతని క్షమని పొందాలనుకుంది. తన మీద ఏ తప్పూ లేకుండా చేసుకోవాలనుకుంది.

ఆ అవకాశం రాకిముందే ఆమె రాఘవరాం స్వంతమయిపోయింది. కొత్తగా పెళ్ళయిన జంట, తొలి దినాలలో శారీరకసుఖాల్లో తేలుతూ ప్రపంచం మరిచిపోతారు. అట్టి పరిస్థితులలో బావకి తన కథ చెబితే ఎంత ఔదర్యం వున్నా, విశాల హృదయంతో ఆలోచించే వాడయినా- విపరీతంగా నిరుత్సాహపడతాడు. అంత తెలిగ్గా తనని దగ్గరికు తీసుకోలేడు.

అందుచేత సరస్వతి ఈవిషయం చెప్పలేదు. అందుకు శిక్షగా ఆమె అశాంతికి గురవుతోంది.

* * *

"ఈరోజు మధ్యాహ్నం శలవు పెట్టు" సరస్వతి నుద్దేశించి చెప్పాడు మూర్తి.

"దేనికి?"

"మా ఇంట్లో ఎవరూ లేరు. కాసేపు సరదాగా గడపొచ్చు" కళ్ళలో కోరికల నీడలు కదులుతున్నాయి.

సరస్వతి గుండెల్లో రాయి పడింది. అసహ్యం కలిగింది.

"వీల్లేదు..... ఆ రోజుని పీడకలగా మర్చిపో"

"నువ్వెలాగైనా అనుకో. నాకు మాత్రం ఆ రోజుని ఈ రోజుగా చేసుకోవాలనుంది."

నా కంఠంలో ప్రాణం వుండగా మళ్ళీ అలా జరగదు."

మూర్తి దెబ్బతిన్నట్లు చూశాడు.

"ఏమిటా ధీమా? నేను తల్చుకుంటే...!"

"నీ యిష్టమొచ్చింది చేసుకోపో!"

"బాగా ఆలోచించి మాట్లాడుతున్నావా?"

"నా దగ్గర రెండు మాటలు వుండవు" ఆవేశంగా అంది సరస్వతి.

కామంతో వళ్ళు తెలియని స్థితిలో వున్న మూర్తికి- ఆమె మీద పీకలదాకా కోపం వచ్చింది.

* * *

తలుపు చప్పుడైంది. రాఘవరాం వెళ్ళి తీసాడు.

ఎదురుగా మూర్తి. "రండి లోపలికి" ఆహ్వానించేడు.

సరస్వతి రెండు కాఫీ కప్పులతో వచ్చి, చెరొకటి అందించింది. కప్పు అందుకుంటూ సరస్వతి కళ్ళల్లోకి హెచ్చరికగా చూసాడు మూర్తి. ఆమె నిర్లక్ష్యంగా తల తిప్పుకుంది. ఇక ఊరుకోకూడదు- అని గట్టిగా నిశ్చయించుకున్నాడు మూర్తి.

"మీ సరస్వతి చాలా తెలివిగల పిల్లండీ!" ఉపోద్ఘాతంగా అన్నాడు. రాఘవరాం విని ఊరుకున్నాడు.

"ఆమెకి ఈ వుద్యోగం ఇప్పించింది నేనే. నా ఋణం వుంచుకోలేదనుకోండి" నెమ్మది. నెమ్మదిగా ఒక్కొక్క విషయం బయట పెట్టసాగాడు.

ఇక సహించలేకపోయాడు రాఘవరాం.

"మిష్టర్ అలాంటి సంగతులు ఇక్కడ మాటాడొద్దు" మర్యాదగా చెప్పాడు.

"అది కాదండీ....మీ భార్య" రాఘవరాంలో సహనం నశించింది. మూర్తి చొక్కా కాలర్ పట్టుకున్నాడు.

"ఏమిటండీ కొడతారా ఏం?" భయపడుతూ అడిగేడు.

"ఛీ! నీలాంటి కుక్కని కొట్టడానిక్కాదు ఈ చేతులు" అని బలం కొద్దీ విసురుగా తోసాడు. ఆ దెబ్బకి వెళ్ళి తలుపు బయట పడ్డాడు మూర్తి. ఎదుం కలుక్కుమంది.

"సరస్వతి నాకంతా చెప్పింది. ఇంకోసారి ఈ గడప తొక్కకు." అని, తలుపులు వేసేసాడు రాఘవరాం.

పుండు మీద కారం చల్లినట్లుగా- లోపల్నుండి ఉల్లాసమైన నవ్వులు విన్పించేయి.

*

